# అనుమాని సౌభాగ్యం

ద్వివేదుల విశాలాక్షి

సంచిలోని కూరలను వంటగది గుమ్మంలో వంపి, పీటపై చతికిలబడ్డాడు సుబ్బారావు. 'హమ్మయ్యా' అంటూ.

అతనివైపు చూడకుండానే 'ఏం తెచ్చారేమిటి?' అని-ప్రశ్నించింది సీతాలక్ష్మి.

'వంకాయలు.'

'కూరకేమైనా మిగులుతాయా?'

'ఎప్పుడూ నువ్వు అలా గంటావని, ఈరోజు బజారంతా గాలించి తెచ్చాననుకో... చూసిన వాళ్ళంతా ఇవి మీకు ఎక్కడ దొరికేయండీ - అని ఒకటే అడగడం' అన్నాడు దర్పంగా సుబ్బారావు,

సీతాలక్ష్మికూడా ఆ మాటనే కొంచెం మార్చి అంది.

'ఈ పుచ్చు వంకాయలు మీకెక్కడ దొరికేయండి' అని.

'ఇవి పుచ్చు వంకాయలా? బాబూ, తెల్లని ముప్వంకాయలు. నొక్కితేపాలుగారుతున్నాయి. మరో పదలం తూసేదా? —అని ఆ కూర లమ్మి తెగ పొగుడుతూంటే—'అనుకొన్నాడు సుబ్బారావు.

'కొంచెం దగ్గరకొచ్చి చూడు సీతా! అలా దూరంనుంచే దబాయిస్తే ఎలా? తరిగి చూస్తే తెలుస్తుంది. ఎంత...'

'ఎంత ముదురువో... ఎన్ని గింజలు, పురుగులు వున్నాయో' అంటూ కత్తిపీటతో కనుక్కున తరిగిందో కాయని సీతాలక్ష్మి.

'అయ్యోరామ. ఇవేం వంకాయలండీ; మీతో ఏ పని చెప్పినా ఇంతే... ఒక్కపని ... ఒక్కటంటే ఒక్కటి సానుకూలంగా చేసుకు రాలేరు కదా! నిన్నటికి నిన్న కాఫీ గుండ తెమ్మంటే, ఒకటో రకమైన చింతగింజల గుండ తెచ్చి నా నెత్తిని కొట్టేరు. తెచ్చానంటే తెచ్చానన్న మాటేకాని, ఆ వస్తువు మంచిదో కుళ్ళుదో చూసుకోకపోతే ఎలా? బజారుకెళ్ళి శుభ్రమైన కూర తేలేని మీ రెందుకు పనికొస్తారండీ' అంది ఈసడింపుగా.

ఆ మాటని అలవాటు పడిన మందు మాత్రలా నిర్వికారంగా మింగి పూరుకొన్నాడు సుబ్బారావు. రోజూ చచ్చేవాడికోసం ఏడిచేవారెవరు-అన్నట్లు, అతనికి జ్ఞానంతెలిసినప్పటి నుంచి వింటున్న ఆ మాట

కోసం ఎంతకని బాధపడ్తాడు? ముద్దు ముద్దుగా అతని మూడవ నెలనే వాళ్ళమ్మ ఆ మాటకి ప్రారంభోత్సవం చేసిందట. 'వెధవ కానా; మూడు నెలలొచ్చినా బుర్ర నిలుప లేకున్నావు. ఎందుకు పనికొస్తావురా' అంటూ.

ఆ వెనుక ఎంతమంది ఆమాటతో అతన్ని ఆశీర్వదించేరో లెక్కవేసి చెప్పడం కష్టమేమరి. సుబ్బారావు రెండో క్లాసు చదువుతుండగా వాళ్ళ నాన్నకి ఇంకో వూరుకి బదిలీ అయింది. అక్కడ స్కూల్లో పిల్లలంతా రెండో ఎక్కం ఇంకోలా చదవడం చూసి హడలి పోయేడు సుబ్బారావు.

ఈ అయ్యవారు తనని చదవమనకుండా వుంటే బాగుండును— అనుకున్నాడు. సుబ్బారావు భయపడినంతా అయింది.

'ఒరేయి సుబ్బాయ్; రెండో ఎక్కం చదవరా' అన్నారు అయ్యవారు

'రెండు ఒకట్లు రెండు; రెండు రెళ్ళు నాలుగు; మూడు రెళ్ళు ఆరు' ఎక్కం చదువుతున్నాడు సుబ్బారావు.

'ఓరి వెధవా! ఒకసారి రెండుని ముందుంచి చదువుతే కొసదాకా అలా చదవలేవూ? మధ్యలో మళ్లా 'మూడు రెళ్లు ఆరు ఏమిటి?' అన్నారు అయ్యవారు.

'మరేమోనండి... మరేమోనండి ... మా వూళ్లో చింతల మాష్టారు అలాగే చెప్పేరండి. ఒక రెండు రెండు; రెండు రెళ్ళు నాలుగు; మూడు రెళ్ళు ఆరు; అని. మరిక్కడేమో అంతా రెండు ఒకట్లు రెండు, అంటున్నారని అలా చదివేనండి' అన్నాడు పదిబెక్కులు బెక్కుతూ.

'ఎక్కం తిన్నగా చదవడం చేతకాక వెధవ కబుర్లు చెప్తున్నావు. రెండో ఎక్కంరాని వెధవ్వి రెండో క్లాసుకి తయారవేవు. ఎందుకు పనికొస్తావురా మొద్దూ' ముద్దు ముద్దుగా నాలుగు - మొట్టికాయలు బహూకరించేరు అయ్యవారు.

సుబ్బాయి అన్న రామాయి. ఇప్పుడు వాళ్ళిద్దర్నీ స్నేహితులు ఆ పేర్లతో పిలవరనుకోండి. 'ఏరా సుబ్బారావు, ఏరా రామారావు' అంటూ పిలుస్తారు అంతా. కాని అప్పుడు అంటే చిన్నప్పుడు అలానే పిల్చేవారు. ఓ రోజు రామాయి సుబ్బాయిని చాటుగా పిల్చి 'ఒరేయి సుబ్బాయి... సుబ్బాయి నాన్న జేబులోంచి ఒక పాతిక పైసలు కొట్టుకు రారా' అన్నాడు ఆప్యాయంగా.

'బజార్లో ఎంత మంచి గాలి పటాలు అమ్ముతున్నారనుకొన్నావు. ఒక పది కొన్నామంటే ఇంక ఆ కోటిగాడి నోరు మూతపడ్తుంది. మహా తనకే రెండు గాలిపటా లున్నాయని ఎగిరి పోతున్నాడు. మనం ఒకటి తర్వాత ఒకటి చొప్పున ఆకాశంలోకి వదిలేమంటే కళ్ళు తేలేసుకొని, నోరు వెళ్ళబెట్టు

కొని చూస్తాడు' అన్నాడు రామాయి నమ్మకంగా.


సుబ్బాయి అన్నయ్యదగ్గర 'ఊఁ' అని వంటింట్లో అమ్మదగ్గర కూర్చున్నాడు. ఎంతకి తమ్ముడు రాకపోవడంతో ... ఆయింతా పట్టుబడి తన పేరుకాని చెప్తున్నాడో ... ఏమో? దూరంనుంచి 'వెధవా నా పేరు చెప్పేవంటే తంతాను' అని బెదిరించ వచ్చని ఇంట్లోకి పిల్లిలా జొరబడ్డాడు రామాయి.

అమ్మ పక్కన మినపచేకోడీలు తింటూ కూర్చున్న సుబ్బాయిని చూస్తే ఎక్కడలేని కోపం రామాయిని వెతుక్కుంటూ వచ్చింది.

'ఒరే సుబ్బాయి ... సుబ్బాయి చూడరా ... చూడరా' అన్నాడు. ఆతృతగా ఆకాశంవైపు చూస్తూ.

ఏమిటో విడ్డూరం అనుకొని సుబ్బాయి పరుగుపెడ్తూ వచ్చేడు. దగ్గరగా రానిచ్చి 'వెధవా డబ్బులు కాతేసుకురారా అంటే, అమ్మ ఒళ్ళో దూరేవా?' అన్నాడు కోపంతో.

'కాదురా ... కాదురా ... మరి



నాన్న చూస్తే తంతాడురా. బుచ్చి చెప్పేస్తానంటున్నదిరా' అన్నాడు.

'అసలు బుచ్చితో ఎందుకు చెప్పేవు? దానినోట్లో నువ్వుగింజ నానదుకదా. ఫరవా లేదులే, సరకా కన్నావని చెప్తానుకాని నువ్వు మెల్లిగా గదిలోకి జారుకో' అని హితోపదేశం చేసేడు రామాయి.

'నేను తేలేనురా. నాన్న తంతాడు' అన్నాడు సుబ్బాయి ఏడుపు గొంతుకతో.

'ఇంట్లోంచి పాతిక పైసలెత్తుకురా లేని వెధవ్వి ఆటలకి సిద్ధపడ్డావు. నువ్వెందుకు పనికొస్తావురా. ఉట్టి తేభ్యంగాడివి' అన్నాడు రామాయి ఈసడింపుగా.

'దండాలండి బాబయ్యా ... దండాలు' అన్నాడు కోటిలింగాలు.

తండ్రి చేతికర్ర నీడలో అడుగులు వేస్తూ నడుస్తున్న సుబ్బాయి బుర్రెత్తి చూసేడు. ఎదురుగుండా నల్లశానపు రాయిలా నిగనిగ మెరుస్తున్న కోటిలింగాలు ముఖంపైవున్న నూనెమడ్డిలాటి చెమటను తుడుచుకొంటూ కన్పించేడు.

'ఏమిటి సంగతి కోటిలింగాలూ! వ్యాపారం ఎలా సాగుతోంది' అని పలకరించేరు రంగయ్యగారు.

'ఏదో ఓ మాదిరిగా వుంది బాబయ్యా. ఈ ఏడు సింతపండు మహాగాయకం అయేలాగుంది. తవరి కొమార్డు మల్లిపోడు ఎల్తున్నారని తెలిసి తవింటికేవస్తున్నాను. అక్కడ మా బామ్మరిదికి కూంత తెలియజేత్తిరా జాగత్త పడ్తాడు. బోలెడు సింత తోట వుంది. ఏరికి అమ్మొద్దన్నానని సెప్పండి. అంతా ఈలు నూసుకు నేనే తీసుకొంటాను. లాబాలు సెరిసగం' అన్నాడు వ్యాపారవేత్త కోటిలింగాలు.

'ఏరా సుబ్బాయి; సింహాచలం ఇల్లు నీకు తెల్సురా' అని ప్రశ్నించేరు రంగయ్యగారు.

'తెలడానికేముంది బాబయ్యా. ఊరిలోంచి కూంత నడుత్తే సింత నాగు పారుతుంటది. ఆ గట్టమ్మొటే పోతే సింతతోట కనపిత్తది. అక్కడికి పదిబారలు ఆ డిల్లు' అన్నాడు కోటిలింగాలు.

'అర్థమయిందిరా' అన్నారు రంగయ్యగారు.

'ఆ... ఆ' అన్నాడు సుబ్బాయి.

సుబ్బాయి మల్లి పాడు వెళ్ళేడు. వచ్చేడు. గుమ్మం ఎక్కుతుండగానే కోటిలింగాలు దర్శనం అయింది.

---

● *భార్య : ఏమండోయ్! ఇప్పుడే చెప్తున్నా! ఇలా అవుతే నేనీ సంసారం ఈదలేను సుమా! మొన్నరాత్రి ఇంటికిరావలసినవారు నిన్నొచ్చారు. నిన్న రాత్రి రావలసిన వారివాళొచ్చారు. ఇవాళ రాత్రి రావలసినవారు మీరు రేపు కనకవస్తే ఒక్క నిమిషం ఇంట్లో వుండను.*

సుబ్బాయి గుండెలు కొట్టుకొన్నాయి.

'ఏరా మామయ్యా వాళ్ళుఅంతా బాగున్నారా?' అని-అడిగింది తల్లి.

'ఆ' అన్నాడు సుబ్బాయి.

'సిన్న బాబూ, నా మాట సెప్పొచ్చినారా' అన్నాడు కోటిలింగాలు ఆతృతగా. లేదన్నాడు సుబ్బాయి.

'ఏటి ... ఏటయింది'

'ఇల్లు దొరకందే, చింతనాగుగట్టుంకే రెండుమైళ్ళు నడిచినా తోటకాదుకదా ఒకచింత చెట్టయినా కన్పించలేదు.'

'ఎటు నడిసినారు బాబూ? తూరుపుకా, పడమరకా?'

'తూరుపుకే.'

'సంపేసినారు బాబయ్యా, ఆడిల్లు పడవటుకున్నాది.'

'మరి నువ్వు చెప్పందే.'

'ఇలాటియన్నీ చెప్పాలా సిన్న బాబూ; తూరుపుకి నేకపోతే పడవటు కుంటాదన్న మాటేకదా? తవలాటి సదువుకున్నోరికి ఆ మాత్తరం ఆలోసన లేకపోతే, మీరు పరీచ్చల్లో ఎలా పాసవుతారు, ఉద్దోగంలో ఎందుకు పనికొత్తారు?' అన్నాడు కోటిలింగాలు.

సుబ్బారావు ఇంకా ఆలోచిస్తూనే వున్నాడు. చదువుకొంటున్న రోజుల్లో కాలేజీపిల్లలు కూడా అదే మాట. ఒక అమ్మాయికైనా పేరు పెట్టడం చేతకాని దద్దమ్మవి. నీ వెందుకు పనికొస్తావయ్యా' అని. కాలేజీలో చదివిన చదువంతా ఆడపిల్లల్ని ఏడిపించిందికే ఉపయోగపడ్తుందని, అదే చేతకాకపోతే ఇంక చదువెందు కన్నట్లు?

'మీ రింకా ఇలాగే కూర్చున్నారండీ, నా వంటంతా అయిందికాని మీరు స్నానం చేసిరావడం అవలేదు. ఆఫీసుకి లేటవుతుందని అందరూ పరుగులు పెడ్తారు. ఇదెక్కడి గోలో పది మేల్కొల్పులు పాడితేకాని లేవనే లేవరు మీరు' అన్నాది సీతాలక్ష్మి సట్టిల్లు సర్దుతూ.

భార్యామణి యొక్క వేడి వేడి మందలింపులతో ఈ లోకంలోకి వచ్చిన సుబ్బారావు తుండుగుడ్డ బుజాన్నేసుకొని స్నానానికి బయలుదేరేడు. నూతిలోంచి ఒక్కొక్క చేదడు నీళ్ళు సుబ్బారావు దేహాన్ని తడుపుతూ తరిగిపోతున్నాయి. ఆ నీటి చల్లదనంతో పాటు ఎన్నో జ్ఞాపకాలు బుర్రలోకి దూరుతున్నాయి. వాటిని వదలించుకొందామనే సదుద్దేశంతో జుట్టును ఈ పక్కనుండి, ఆ పక్కకి మహా జోరుగా రుద్దేస్తున్నాడు సుబ్బారావు. అయినా అది వదలందే.

అలవాటు ప్రకారం ఆ రోజు కూడా అలస్యంగా ఆఫీసుకి చేరుకొని తన టేబిలువైపు నడుస్తున్నాడు సుబ్బారావు. మేనేజరు గదిలో నుండి 'సుబ్బారావు' అనే సింహగర్జన విన్పించింది.

'బాబయ్యా!తవకోసం మేనేజరు బాబు సానాసేపటినుండి సూత్తున్నారు' అన్న బంట్రోతు మాట కాని, 'ముందు ఇటువైపురా' అని నీలకంఠం చేసిన సౌజ్ఞకాని సుబ్బారావు గుర్తించలేదు. ఉరుకులు పరుగులుగా మేనేజరు గదిలోకి వెళ్ళిపోయేడు.

పది నిమిషాలకి పైగా తినవలసినవన్నీ తిని, ముఖం వేలేసుకు వచ్చి తన టేబిలుముందు కూలబడ్డాడు సుబ్బారావు.

'ఏంరా నాన్నా, ఏం జరిగిందిరా?' అని పరామర్శ చేసేడు పక్కనే కూర్చున్న భార్య స్నేహితుడు పున్నయ్య.


'వుండరా... చస్తుంటేను' విసుకొన్నాడు సుబ్బారావు.

సుబ్బారావు విసుక్కొన్నాడూ అంటే అదేదో పెద్దచిక్కే అనుకొన్నాడు టైపిస్టు అప్పారావు.

పక్కగదిలో బోనులో పులిలా పచారుచేస్తున్న మేనేజరుకి దడిసి ఇంకేం సంభాషణా సాగించలేక పోయేరు సహోద్యోగులు.

లంచ్ టైములో అసలు విషయం బయట పడింది.

'ఓరీ దద్దమ్మా, అంతాపాడుచేసుకొచ్చావు' అని విరుచుకు పడ్డాడు నీలకంఠం. 'అందుకే ముందుగా ఇటు రా రా అని నేను మొత్తుకొంటున్నా చూసేవా. నీ లాంటివాడు ఒక్కడుంటే చాలు చుట్టు



పక్కల వారి నందరినీ బాధ పెట్టిందికి." అన్నాడు.

"నన్ను రమ్మంటే ఏమని జవాబు చెప్పేనో తెలుసా? ఆదివారంనాడు కూడా పనిచేసిందికి, మేము నీ బానిసలం అనుకొన్నావా? శలవురోజున పనిచేస్తే దానికి ఎక్కువజీతం ఇయ్యవలసిందే. గవర్నమెంటు ఇచ్చిన శలవు కాదనేందుకు నువ్వెవడివి? అన్నాను. ఆఫీసరుతో కాదు వాడి తాతతో చెప్పుకో ఇకముందు వెట్టి చాకిరి చెయ్యను-అన్నాను. దానితో మేనేజరు ముఖం నయాపైసంత అయిందనుకో. తనలో తనే ఏదో గొణుక్కొంటూ పక్కగదిలోకి వెళ్ళిపోయేడు." అన్నాడు నీలకంఠం గర్వంగా.

"ఇంక ఇప్పుడు నేనేం చెయ్యలేనురా. బోలెడు వర్కు పడుంది. రేపు సాయంకాలానికల్లా అదంతా పూర్తి - కావాలిట. నా సోమరితనం వల్లే అంత కూడ పడిందనీ, దానిని రేపు పూర్తిచెయ్యక వీలలేదనీ, కసిరి కొట్టేడు, "చిత్తం అలాగేనండి. రేపు ఎంత రాత్రికైనా పూర్తి చేస్తాను" అన్నాను అన్నాడు సుబ్బారావు.

"పౌరుషంలేని చచ్చువెధవలంతా తయారయితే అధికారుల ఆర్భాటాలు ఇలాగే వుంటాయి. చేసుకొన్న వారికి చేసుకొన్నంత మహాదేవా అని అఘోరించు. హాయిగా ఆదివారంనాడు తినితిరిగి ఆనందించకుండా ఆఫీసుకో మగ్గి చచ్చేరాత నీ నుదటురాసుంటే నేనేం చెయ్యగలను" అన్నాడు నీలకంఠం హేళనగా.

"నేను కూడా రావాలిరా" అన్నాడు పున్నయ్య.

"మరేం స్నేహితులేగా. కట్టకట్టుకొని చావండి. నాకేం కావాలి. ఈ ఆఫీసులో ఒక కట్టు, కలివిడి వుంది ఏడుస్తేకదా బాగుపడిందికి" అన్నాడు నీలకంఠం కోపంగా.

"లేదు. ఇంకెప్పుడు ఇలా జరుగనీయం" అన్నారు సుబ్బారావు, పున్నయ్య ఐక్యకంఠంతో.

మరునాడు ఆదివారం కదా. వేళకి సరిగా ఆఫీసుకి రాకపోతే బాగుండదని టంచనుగా పదిగంటలకల్లా ఆఫీసు గుమ్మంలో అడుగు పెట్టేడు సుబ్బారావు. టేబిలు ముందు కూర్చుని కాగితాలలో మునిగి తేలుతున్న నీలకంఠాన్ని చూసి తన కళ్ళని తనే నమ్మలేకపోయేడు.

"ఏమిటి సంగతి?" అన్నాడు మెల్లగా, అతని టేబిలుముందు నుంచి వెళ్తూ సుబ్బారావు.

"సాయంకాలం చెప్తా" అన్నాడు మేనేజరు గదివైపు చూస్తూ నీలకంఠం.

ఆఫీసు గుమ్మంవదలి ఇల్లు చేరే దాకా గుక్కతిప్పకుండా చెప్పేడు. నిన్నసాయంకాలం ఇంటికెళ్ళి కాఫీతాగుతుంటే సన్నాలు వచ్చేడు.

'బాబూ మేనేజరుగారుమిమ్మల్ని రమ్మంటున్నారు' అంటూ.

'సోమవారం ఆఫీసులో కలుస్తానని చెప్పరా' అన్నాను.

'కాదు బాబూ! ఏదో అర్జంటు పనున్నాదిట. వున్నపళంగా తీసుకు రమ్మన్నారు' అన్నాడు.

చెయ్యగలిగినంత ఆలస్యంచేసి ఒక అరగంట కల్లా బయలుదేరేను. నేను వెళ్ళేసరికి గుమ్మంలో కారు పెట్టుకొని ఎక్కడికో వెళ్ళే ప్రయత్నంలో వున్నట్లుంది మేనేజరు. వారి శ్రీమతి కారులో కూర్చుంది.

'రా నాన్నా వేళయిపోతున్నా' దంటూ అతని చెయ్యి పట్టుకొని లాగుతున్నాడు వారి సుపుత్రుడు.

'రాండి ... రాండి ... మీ కోసమే చూస్తున్నాను' అని సాదరంగా లోపలికి తీసుకెళ్ళి డ్రాయింగు రూమ్‌లో కూర్చోబెట్టేడు. అప్పన్నా బాబుగారికి కాఫీ పట్టుకురా' అన్నాడు నౌకరుతో.

'ఎందుకులెండి ఇప్పుడే తాగి వచ్చేను' అన్నాను.

'ఓ సారి తాగితేనేం ... కాఫీ ఎన్నిసార్లైనా తాగొచ్చు' అన్నాడు.

అప్పన్న తెచ్చిన కాఫీ కప్పందుకొని మెల్ల మెల్లగా తాగుతుంటే అసలు విషయం మొదలుపెట్టేడు.

'చూడండి నీలకంఠంగారూ, ఇది మార్చి నెల. ఈ నెలాఖరుకి అన్ని లెక్కలు తయారై ఫైళ్ళన్నీ హెడ్డాఫీసుకి పంపేయాలి ఇది ప్రతి సంవత్సరం జరుగుతున్న పనేకదా? ఇంతకాలంగా పనిచేస్తున్న మీకు తెలియనిది కాదు. నా బాధ్యతకొద్దీ నేను చెప్తున్నాను. హెడ్డాఫీసులో కొత్తగా వచ్చిన ఆఫీసరు యముడు లాటివాడు అంటున్నారు అంతా. వేళకి సరిగా పని తెమలకపోతే అనవసరమైన రిపోర్టులు – గొడవ. ఏదో ఈ ఏడుకాస్తా చల్లగా గడిచిపోతే ప్రమోషన్ వస్తుందనుకొంటున్నాను. ఇప్పుడే చికాకయినా ఇంక అదలా పడివుండవలసిందే.

మీ మాటంటే ఆఫీసులో అందరికి గురుంది. అందుచే ఎలాగైనా మీరు చేస్తూ, ఇతరులచేత ఈ పని పూర్తి చేయించాలి. ఇది మేనేజరుగా ఆజ్ఞాపించడంలేదు. స్నేహితుడుగా అర్థిస్తున్నాను.

నిజం చెప్పొద్దూ, నా మనస్సు కరిగిపోయింది. పాపం పెద్దవాడు.

---

● *ఒకసారి ఫ్రెంచి తత్త్వవేత వోల్టేర్ మరొక రచయితను మెచ్చుకుంటూ మాట్లాడుతున్నాడు. ఒక స్నేహితుడు "మీ గురించి అతను ఎప్పుడూ తిడుతూ వుంటాడు. మీరతన్ని మెచ్చుకోవడం విశేషమే" అన్నాడు.– "బహుశా మేమిద్దరమూ పొరబడుతున్నామనుకుంటా."*

నోరు విడిచి అడిగేడు. వూ... కానీ...అలాగే అందాం అనిపిం చింది.

'ఏదో కోపంలో అలా అన్నానే కాని, మీమాట కాదంటానా? ఇంక ఆపని విషయంలో మీరేమీ బెంగ పెట్టుకోకండి' అన్నాను, ఆయన కొండ నందుకొన్నా. డనుకో......

ఈ సంఘటన జరిగి ఏడాది కావ స్తున్నా ఇంకా సుబ్బారావు మన సులో పచ్చిగానేవుంది. ఎదిర్చి జవాబు చెప్పిన నీలకంఠానికి ఏడాది తిరక్కుండానే ప్రమోషన్ వచ్చింది. చచ్చిచెడి— గానుగెద్దులా చాకిరి చేస్తున్నతనూ, పున్నయ్యా ఎదుగు బొదుగులేని జీతంరాళ్లు ఇంకా అందుకొంటూనే వున్నారు, అను వుగా వున్నవాళ్లని చూస్తే అందరికి అలుసే మరి.

మేనేజరు శలవుపై వెళ్తూ ఆఫీ సులో అధికారం అంతా హెడ్ గుమాస్తా రామానుజంకి అప్ప గించేడు. అల్పుడికి అధికారం ఇస్తే ఎలా వుంటుందో పది రోజులకల్లా చేసి చూపించేడు రామానుజం. పద్మనాభం తల్లికి ప్రాణంమీదికి వచ్చింది. ఉత్తరం చూపించి శలవు కావాలన్నాడుట ఇప్పుడు వీలు కాదు. రెండు రోజు లాగి వెళ్ళ మన్నాడుట.

ఏం ఉద్యోగాలు ఈ రోజుం టాయి, రేపు పోతాయి. తనువు చాలిస్తున్న తల్లి ముఖం మళ్ళా చూడగలడా? రెండు రోజులు పోయేకవెళ్తే ఆఖరి చూపైనా అందు తుందన్న నమ్మకం ఏమిటి? పద్మ నాభం ఆ ఆవేశంలో ఏం చేస్తు న్నాడో తెలియకుండానే ఉద్యో గానికి రాజీనామా కాగితం రాసి రామానుజం టేబిలుమీద పెట్టి వెళ్ళిపోయేడు.

తల్లి దినవారాలు ముగించుకొని మేనేజరుతో చెప్పి పోదామని వచ్చేడుట పద్మనాభం. రాత్రికి రాత్రే అతని గదికి రామానుజం పనికట్టుకొచ్చి 'బాబ్బాబు ఈ విషయం తెలియనియ్యకు. అపత్సమయాల్లో శలవెందుకు ఇయ్యలేదని నన్ను తిట్టిపోస్తాడు. నీ రాజీనామా కాగితం ఆనాడే కాల్చివారేసేను. నువ్విప్పుడు శలవునుంచి తిరిగొస్తున్నా వన్నమాట. తెలిసిందా?' అన్నా డుట.

మరునాడు రామానుజం ఇంటి ముందు సుబ్బారావుకి కన్పించేడు పద్మనాభం.

'ఆయన సహాయానికి ధన్య వాదాలు తెల్పుకు వస్తున్నానురా' అన్నాడు.

'బాబూ, నా కూలిడబ్బులు' అంటూ వెంటపడ్డాడో గంపకూలి.

'వెధవా, మార్కెట్నుంచి ఇక్క డికి ఇరవై పైసలిస్తే చాలదూ? ఇంతకీ రాళ్ళూ, గుళ్ళూ మోసేవా? వంద మామిడి పళ్లు ఎంత బరువు ఉంటాయి?' అని వాణ్ణి విసిరి

కొట్టేడు. సరిగ్గా సమయానికి ఎక్కడినుండి ఊడిపడ్డాడో రాఘవేంద్రం అక్కడ ప్రత్యక్షమై 'ఏం పద్మనాభం, మళ్ళా ఏమిటి గిరాకీ? ఎవరికి మామిడి పళ్ళ నజరానా?' అన్నాడు వ్యంగంగా.


అది వరకు పద్మనాభం పది బస్తాల ధాన్యం మేనేజరు కూతురి పెళ్ళికి పంపి, అందరికన్న ముందు ఇంక్రిమెంటు అందుకొన్నాడని రాఘవేంద్రానికి అనుమానం.

'సంతోషించేం... తమ కుశాగ్ర బుద్ధికికాని, ఈ పళ్లు పక్కవీధిలో వున్న మాతోడల్లుడు కొనిపెట్టమంటే కొని, వాళ్ళింట్లో విడిచి వస్తున్నాను.' అన్నాడు పద్మనాభం బింకంగా. ఆలోచనలన్నీ సుబ్బారావుని ఒకే అభిప్రాయానికి లాగుతున్నాయి. అణగి, మణగి అడకువగా వున్నవాళ్ళని అనాదరం చెయ్యడం, ఎదిరించి పౌరుషంగా నిల్చిన వాళ్ళని పైకి ఎగతొయ్యడం జరుగుతున్నాది తమ ఆఫీసులో. నెమ్మదయిన వాళ్ళకి ఒకపూట లశవైనా దొరకడంలేదు. ఒక పూట దాకా ఎందుకు? మొన్నటికి మొన్న శ్రీమతి సినీమాకి వెళ్దామంటే ఒక గంట ముందుగా ఆఫీసు వదిలిందికి కూడా అవలేదు.

'మీరు సినీమాకి చిత్తగిస్తే ఇక్కడ పనిచేసేదెవరయ్యా? ముందు ఆ పని పూర్తిచేసి మరీ కదులు' అన్నాడు మేనేజరు.

వేళకి ఇంటికి రాకపోతే శ్రీమతి చదివే అష్టకాలకి అంతం వుండదు. 'ఎలాగైతేనేం మహా ఉద్యోగం మీ రొక్కరే చేస్తున్నారు. నేటి కేడాదయింది ఒక్కరోజు శలవు తీసుకోలేదుకదా?

ఈ రోజు ఒకగంట ముందు



ఇంటికి వెళ్తానంటే మేనేజరు వద్దంటాడా? అవును లెండి... మీ ముఖం చూస్తే అంతకన్న ఏమన బుద్ధి పుడుతుంది. ఓ ఆత్మ గౌరవం, ఓ పౌరుషం వుంటేకదా? ప్రతిదానికీ డూ డూ డూ డూ బసవన్నా అంటే బుర్రూపుతూ ఆఫీసులో కూర్చుంటే అంతకన్న గౌరవం ఏం పెరుగుతుందీ?

ఉద్యోగం చేస్తున్న అందరూ మీలాగే వుంటున్నారా? కిందటి నెలలో మాలతమ్మ, చెల్లెలి పెళ్ళికి మొగుణ్ణికూడా వెంట బెట్టుకుని పోయి పదిహేను రోజులుండి వచ్చిందే; ఆయనక్కూడా మీ ఆఫీసులోనే ఉద్యోగంటు కదూ? మరి శలవు ఎలా దొరికిందో? మేనేజరు చేత ఒక్కగంట శలవు శాంక్షన్ చేయించుకురాలేని మీరేం చేసుకురాగలరండీ' అని ఒకటే సాధింపులు.

ఇల్లు వాకిలి పట్టుకుంటా ఇంత చాకిరి చేస్తున్నా ఆఫీసులో ఓ మెప్పూ, మెహర్బానీ వుందా అంటే అదీలేదు. ఆఫీసులో ఏ చిన్న తప్పు జరిగినా అందుకు సుబ్బారావే బాధ్యుడైనట్లు అతనిపై ఎగిరి పడతాడు మేనేజరు. భగవంతుడా సంతృప్తి, సానుభూతి లేని ఈ మానవుల మధ్య ఎందుకు జన్మమెత్తించేవు? ఇంతకన్న అడవిలో జంతువో, పక్షో, చెట్టో, పుట్టో అయినా బాగుండి పోయేది. ఈ సాధింపుల, ఊడిగాలు లేక పోవును అని బాధపడేవాడు సుబ్బారావు.

ఆలోచనలు నూతిలోని ఊటలా ఊరిపోతున్నాయి. చాదలకి చాదలు నీళ్ళు నూతిలోంచి తరిగి పోతున్నాయి.

'అయ్యో రామ, ఇంకా మీ స్నానం పూర్తికాలేదుటండీ, ఇంక ఈ రోజుకి ఆఫీసుకి వెళ్ళే మాటలేదా? అన్నాడంటే ఆ మేనేజరుది తప్పా? పదిగంటలు కావస్తోంది. ఇంకా అయ్యగారి స్నానం పూర్తికాలేదు. ఇంక భోజనం చేసే దెప్పుడు? ఆఫీసు కెళ్ళే దెప్పుడు?' అంది సీతాలక్ష్మి అదలింపుగా.

ఒక్కసారి సుబ్బారావు చేతిలోని చాద జారిపోయింది. తను ఇంత సేపుగా పడుతున్న తొందరకి అర్థం లేదనుకొన్నాడు. ఈ రోజు ఆఫీసుకి తను పోనక్కరలేదు. ఆ మాటే భార్యతో అన్నాడు.

'ఆఫీసుకి వెళ్ళనక్కరలేదే సీతా' అన్నాడు.

'ఆ మాట ముందుగా చెప్తే మీ సొమ్మేం పోతుంది? తెల్లారి లేచింది లగాయతు పరుగులు పెడ్తున్నప్పుడైనా ఇంట్లో ఇల్లాలికి చెప్పాలని తెలియలేదా?'

ఆ సాధింపులు సుబ్బారావు చెవులలోకి జొరబడలేదు. ఈరోజు తను ఆఫీసుకి వెళ్ళబోవడంలేదు. ఆ డొక్కు కుర్చీలో సాయంకాలం ఆరు

గంటలదాకా అతుక్కు పోనక్కర లేదు. చీటికి, మాటికి చిరచిరలాడే మేనేజరు కోపం ఈరోజు తన్నేమీ చేయలేదు.

హాయిగా భోంచేసి ఈజీఛైరులో పడుకొని కావలసిన పుస్తకమో, పేపరో చదువుకోవచ్చు. ఇంకా మనసైతే నులక మంచం ఎండా నీడలమధ్యగా వేసుకొని ఓ కునుకు తీయొచ్చు. ఆహా ... హా ... ఏం మజాగా వుంటుంది. ఏం పర్వదినం? 'ఓరే సుబ్బారావు అదృష్టం అంటే నీదేరా' అని భుజం చరుచుకొందామని చేతితో చాదని వదలిపెట్టేడు. అది జరజర జారుకొంటూ 'దభీలు' మని నూతిలో పడ్డది.

సుబ్బారావు గుండెలో 'గుభీలు' మని ఓ బండరాయి పడింది. అరె ... తెల్లారి పది గంటలైనా ఇంకా సన్నాలు రాలేదే! కొంపతీసి ... ' ... మరి ఆలోచించలేక పోయేడు సుబ్బారావు. తడిపంచని వదలి పొడి బట్ట కట్టుకొని వాకిట్లోకి పరుగు లేసేడు.

'సీతా! ... సీతా! నా కోసం సన్నాలుకాని వచ్చేడా? లేక ఇంకెవరైనా ఆఫీసు బంట్రోతు కాని ...'

సీతాలక్ష్మి అర్థం కానట్లు చూసింది.

'ఏమిటీ దెయ్యంపట్టినట్లు అలా చూస్తావు? నిన్నే అడిగేది' అన్నాడు సుబ్బారావు ఆతృతగా.

'మీ మాటలు వింటుంటే దెయ్యమైనా పడ్తుంది; పిచ్చయినా ఎత్తుతుంది. లేకుంటే ఏమిటండీ ఆ మాటలు? ఏదో పెద్ద ఆఫీసరు గారిలా ... ... రోజూ మీ కోసం బంట్రోతులూ, గుమాస్తాలు తిరు వీధులు తిరుగుతున్నట్లు ...' అంది ఆక్షేపణగా.

సీతాలక్ష్మి మాట నూటికి నూరు పాళ్ళు నిజం. అయినా సుబ్బారావు చూస్తూనే వున్నాడు. తన కోసం మేనేజరు ఇంకా బంట్రోతుని పంపలేదేమని.

వీధి వరండాకున్న తడిక కదిలినట్లు చప్పుడయింది. ఎవరో వ్యక్తి వరండా దాటి చావిటి గుమ్మంలో అడుగు పెడుతున్నట్లు గోడపై నున్న ఎండలో నీడపడింది. "హమ్మయ్య" అనుకొన్నాడు సుబ్బారావు. ముందురోజు సాయంకాలం సహోద్యోగుల పొగడ్తలు మనసులో తిరగసాగేయి.

---

● హెడ్మాష్టరు : "ఏమిటండీ ఆ ఖంగారు? అలా హడావుడిగా పరుగెత్తుతున్నారేమిటి?"

మాష్టారు : "ఏముందండీ? ఇప్పుడే కొత్త టెక్స్టు పుస్తకం కొనుక్కొచ్చాను. ఇంతలో ఇంకో ఎడిషన్ రాక ముందే క్లాసుకు చేరుకుందామని."

'ఇంత ధైర్యం ఎక్కడ సంపాదించేవోయి? నిజంగా ఆత్మాభిమానమున్న మగాణ్ణనిపించుకొన్నావు ఇంతకాలానికి.'

'ఈ సుబ్బారావు దగ్గర మన పప్పు లుడకవని ఇప్పటికైనా మన మేనేజరుకి తెలిసొస్తుంది.'

'మనం ఎలా నడుపుతే అలా నడిచే యంత్రం కాడని, అతనికి కష్టం, సుఖం, మంచి, మర్యాదా కావాలని:'

మంచి తనాన్ని అలుసుగా తీసుకొనే మనుష్యులదగ్గర ఎలా మసలుకోవాలో నేర్చుకొన్నాడని, మేనేజరుకి మహా మంచి పాఠంనేర్పేవోయి సుబ్బారావు'అన్నారు అంతా సమూహాగానంలా.

తోటి గుమాస్తాల ముఖాలలో తొణికిసలాడుతున్న సంతృప్తిని చూసి ఇంతకాలం ఆ మేనేజరు అడుగులకు మడుగులొత్తుతూ సాటి గుమాస్తాల మనస్సులను ఎంతలా నొప్పించేను. ఊరంతా ఒకదారైతే వులిపికట్టె కో దారి అన్నట్లు అయింది నా పని అని బాధపడ్డాడు సుబ్బారావు.

'ఓర్చినమ్మకు తేటనీరు అనేవారు పూర్వం; కాని, ఈనాడు ఎదురు తిరిగినవాడినే ఏలుకో రాజ్యం' అంటారు. ఇంక చూడాలి సుబ్బారావు తడాకా. తెల్లారే సరికి మేనేజరు మంతనాలకి బంట్రోతుని పంపకపోతే నా పేరు మార్చుకుంటా' నన్నాడు పద్మనాభం.

'ఇంతకాలానికి నువ్వుఇరవయ్యో శతాబ్దపు మనుషుల్లో పడ్డందుకు నా శుభాకాంక్షలు' అన్నాడునీలకంఠం.

'ఈ సంతోష సమయంలో సుబ్బారావు మనందరికి కాఫీపార్టి ఇయ్యాలి' అన్నారు ఎవరో. అంతా అయ్యరు హొటలులోకి దారితీసేరు. 'సుబ్బారావుకి ... జై ... విప్లవ వీరుడుకి ... జై' జయ జయ నాదాలు హొటలు గది నిండిపోయేయి. కడుపులో కాఫీ పడ్డంతో ఆవేశాలు హద్దుల్లో కొచ్చేయి.

మళ్ళా రేపు కలుద్దాం. ఏ సమయంలోనైనా మేమంతా నీ కండగా నిలుస్తాము. ధైర్యంగా వుండు. నిజంగా నీలాటి వీరుడు మా మధ్య వున్నందుకు మేమెంతో గర్విస్తున్నాం' అన్నారు అనుయాయులంతా.

అందరిదగ్గర శలవు పుచ్చుకుని ఇంటిముఖం పెట్టేడు సుబ్బారావు. అతని వెనుక నీడలా అనుసరిస్తూ వస్తున్నాడు వున్నయ్య. సుబ్బారావు భుజంపై చెయ్యి పడింది.

'ఎవరు వున్నయ్యా? నువ్వు వాళ్ళతో వెళ్ళలేదా?' సుబ్బారావు వెనుతిరిగి పలుకరించేడు.


'లేదురా ... ఇంతకీ ఏం జరిగిందో వివరంగా చెప్పరా నాయనా; వీళ్ళ పొగడ్తలకి ఉబ్బి తబ్బిబ్బయి పోతున్నావు కాని, వీళ్ళంతా తడిగుడ్డతో గొంతుక కోసే రకంరా. ముఖం

ముందు ఒకటి, ముఖం వెనుక ఒకటి. చెప్పరా నాయనా ఏం జరిగింది?' అని ప్రశ్నించేడు పున్నయ్య. అతని మనసులో గూడు కట్టుకొన్న భయం ముఖంలో ప్రతిఫలిస్తోంది. 'ఏం జరిగిందా? ఏం జరగాలో అదే జరిగింది.' సుబ్బారావులో వున్న మత్తు ఇంకా దిగిరాలేదు.

సహనానికి, సాధుత్వానికికూడా ఒక హద్దంటూ ఉంటుంది. అతి సాధు జంతువు అనుకొనే పిలికూడా ఒక గదిలో పెట్టి తన్నబోతే ఎదురు తిరిగి గుడ్లు పీకుతుంది. అంతమాత్రంచేత పిల్లి శౌర్యమైన జంతు వనగలమా? దానికి బైటపడిందికి మార్గం లేక— ఆత్మ రక్షణార్థం తనలో లేని క్రౌర్యాన్ని ఉత్పన్నం చేసుకొంటుంది. ప్రాణానికి తెగించి పోరాడుతుంది. కాని అపాయం తప్పిన అరక్షణంలో దాని ధైర్య స్థయిర్యాలు మాయమైపోతాయి. మళ్ళా మూల మూలల నక్కుతూ భయంగా మ్యావు... మ్యావు మంటుంది.

పున్నయ్య విడిచిన నిట్టూర్పుతో అదే పరిస్థితిలోనే పడ్డాడు సుబ్బారావు. ఒకమూల సహోద్యోగుల పొగడ్తలు, వాగ్దానాలు ఉత్తేజపరుస్తున్నా మనసులో ఏదో భీతి లోలోపల పీకుతూనే వుంది. విధి వక్రించి అనుకొన్నట్లు కాకపోతే...?

'పోవోయ్; మేమంతా నీ అండ లేముటోయి? మేనేజరుతో వాదులాడి అవసరమైతే స్ట్రయికులాటిది జరిపించి న్యాయం జరిగేలా చూస్తాము. లేకుంటె తన అజాగ్రత్త వల్ల పాడైన రికార్డంతా రాత్రల్లా మేలుకొని నిన్ను రాయమంటాడా?



మళ్ళా ఒక్క మంచి మాటైనా నీ గురించి పైకి రాయలేదేం ? పాపం నువ్వు యంత్రానివనుకొన్నాడు. బలే ... మంచిపని చేసేవ్ సుబ్బారావు. నువ్వు చెప్పిన జవాబుతో అయ్యగారి అహంకారం కొంత తగ్గి ఇంకకాళ్ళబేరానికొస్తాడు. లేకపోతే మనబతుకులన్నీ తనచేతిలో వున్నట్లు మాట్లాడుతాడు. నిజానికి హెడ్డాఫీసులో వీడిని చూసేవాడే లేడుట. వీడి మాటంటే ఎవరూ ఖాతరే చెయ్యరుట. మా బావమరిది, తోటల్లుడి పినమామగారు అక్కడే పని చేస్తున్నారు. ఆయన చెప్పేరు. మన నీలకంఠం అంటాడు గదా, మనమంతా కలసి ఒక అర్జీ రాసేమంటే వీడిక్కడినుంచి తోకముడవ్వలసిందే అంటాడు.' బుచ్చిబాబు మాటలు సుబ్బారావుకి ఇంకా మరవుకి రాలేదు.

ఏ విధాన చూసినా తన భయానికి ఆస్కారం లేదనుకొన్నాడు సుబ్బారావు, దీంట్లో కంగారు పడింది కేం లేదురా వున్నయ్యా' అన్నాడు. ఈ మేనేజరుకి ఇలాటి ఎదురు దెబ్బలు అలవాటేరా. కన్నంలో తేలు కుట్టిన దొంగలా నోరు మూసుకొని మనని మంచి చేసుకొందికే ప్రయత్నిస్తాడు కాని, పైకి రాయిదురా' అన్నాడు.

'ఏమిటో ఆ ధైర్యం?' వెనక నుండి రాఘవేంద్రం గొంతుక వినిపించింది.

'ఇదివరలో అనుభవాలు' సుబ్బారావు జవాబు.

'ఎవరివి ?'

'మరెవరివి ? నీలకంఠం. పద్మనాభం.'

'ఓరి దద్దమ్మా ఆ కథలన్నీ నిజమనుకొంటున్నావా ?'

'కథలా ?'

'కాక ... వీళ్ళంతా నిజంగా జరిగినట్లే ...'

'ఎవరిమీదోయి రాఘవేంద్రం; ఆ దండయాత్ర ?' నీలకంఠం ప్రశ్నించేడు.

'పార్కుకి పోతానన్నావు, వెళ్ళ లేదా?' సుబ్బారావు ప్రశ్నించేడు.

'లేదు ... ఈ వీధిలో మా బంధువాకాయన ఉంటే చూసి పోదామని ...'

'మరి కొంచెం విషం నీ గొంతుకలో నూరిపోద్దామని ...' పున్నయ్య నీలకంఠాన్ని మనస్సులో తిట్టుకొన్నాడు.

సుబ్బారావు అందరిదగ్గర శలవు పుచ్చుకొని ఇంటి గుమ్మం ఎక్కేడు.

'ధైర్యంగావుండు సుబ్బారావు' నీలకంఠం హెచ్చరిక.

'దైవాన్ని పార్థించు' పున్నయ్య హితోపదేశం.

చావిట్లోకొచ్చిన మనిషి 'సుబ్బా రావు' అని పిల్చేడు.

సన్నాలు కాదు. ఇంకే ఆఫీసు బంట్రోతు కాదు. పున్నయ్య. సుబ్బా రావు బాల్యమిత్రుడు. శ్రేయోభి లాషి అయిన పున్నయ్య.

'ఎవరు? పున్నయ్యా!'

అవును ... నేనే...'

'రా ... ఇలా వాకిట్లోకి ... ఈ రోజు ఆఫీసు పీడ లేదుకదా అని విశ్రాంతి తీతుకొంటున్నాను.'

'ఇంక ఆఫీసు పీడ నీకు పూర్తిగా విరగడయిందిలే' మనసులోనే గొణు క్కున్నాడు పున్నయ్య.

'ఏం ఈ రోజు నువ్వు ఆఫీసుకి పోలేదా ?'

'కూ ర్చో బుద్ధి కా క శలవు పెట్టేను.'

'ఎలావుంది సంగతి ?'

'నిమ్మకి నీరెత్తినట్లు.'

'నా విషయం...'

'ఎవరికొ్కావాలి ?'

'మేనేజరు ఏమంటున్నాడు ?'

పున్నయ్య కళ్ళల్లో నీళ్ళు తిరి గేయి.

'ఏమిటిపున్నయ్యా?'సుబ్బారావు గాభరాగా మంచంమీంచి లేచేడు.

సుబ్బారావుని కౌగలించుకొని బావురుమన్నాడు పున్నయ్య.

'ఏమైంది పున్నయ్యా ?'

సుబ్బారావు గొంతుక జీరపోయింది.

'ఏది జరగకూడదో అదే జరి గింది.' రాఘవేంద్రం లోపలికి వచ్చేడు.

'నీలాటి అమాయకు లుండవల సిన లోకం కాదురా ఇది'.

'నీకు బదులుగా మేనేజరు కాళ్లు పట్టుకొని ప్రార్థించేను. బీదవాడు ఏదో తెలియక అన్నాడు. ఈసారికి క్ష మి ం చ మ న్నా ను. లాభం లేకపోయింది. రాత్రంతా వాళ్ళు విషం రంగరించి పోసేరురా. ఒక్క డంటే ఒక్కడు నీ తరఫున మాట్లాడ లేదు.' అన్నాడు రాఘవేంద్రం.

'ఎవరిమాట నీ వంటున్నది?'

'ఎవరైతే నిన్ను విప్లవ వీరుడవని నిన్న తెగ పొగిడేరో ఆ మిత్రులే. ఏ ఎండ కా గొడుగు పట్టే, మదిలో విషం పెదిమల అమృతం నింపుకొని మాట్లాడే నీ మిత్రులే.' పున్నయ్య బాధగా అన్నాడు.

'వాళ్లు మిత్రులు కారు. శత్రు వులు' రాఘవేంద్రగొణుక్కున్నాడు. సుబ్బారావు చెవుల్లో వారి మాటలు దూరలేదు. ఒక్కసారిగా జ్వలించి ఆరిన జ్యోతిలా నిస్తేజంగా మంచం మీద వాలిపోయేడు.

□□□